నకిలీ విత్తనాలతో నష్టపోవద్దు

- విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన
- కొనుగోలు రశీదులు తీసుకొని భద్ర పరచాలని సూచన
- లైసెన్స్ లేకుండా విక్రయిస్తే చర్యలు తప్పవు
- దుకాణాల్లో రికార్డు నమోదు తప్పనిసరి

అలంపూర్ రూరల్: మండలంలోని భైరంపల్లి, గొందిమల్ల, కోనేరు రైతులకు శనివారం విత్తనాల కొనుగోళ్లలో తీసుకోవల్సిన జగ్రత్తలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి అనిత మాట్లాడుతూ లూజుగా ఉన్న సంచులలోని విత్తనాలను కొనుగోలు చేయొద్దన్నారు. రైతులు తప్పని సరిగా గుర్తింపు పొందిన ఆదీకృత డీలర్ వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. ఎవరైనా గ్రామాల్లో విత్తనాలు విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓలు సాయిరాం, అనిత, శిరిషా, నీలిమ, రైతులు పాల్గొన్నారు.

అలంపూర్: రైతులు నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి వేముల శ్యామ్ ఒక ప్రకటనలో కోరారు. రాబోయే వానకాలం సీజన్‌లో జిల్లాలో రైతులు పత్తి పంటను సాగు చేస్తారని తెలిపారు. రైతులు నకిలీ విత్తనాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. రైతులు అనుమానం వస్తే తక్షణమే స్థానిక వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు.


కొర్విపాడులో రైతులకు అవగాహన కల్పిస్తున్న సుబ్బారెడ్డి


భైరంపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

వెంకటాపురంలో దుకాణాల పరిశీలన

అయిజ: రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేస్తే నష్టపోతారని, లైసెన్స్ కలిగిన దుకాణాల్లో విత్తనాలు కొనాలని మండల వ్యవసాయ అధికారి శంకర్ లాల్ కోరారు. శనివారం మండలంలోని యాపదిన్నెలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులకు విత్తనాల నాణ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గుర్తింపు ఉన్న విత్తన విక్రయ దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని, దానికి సంబంధించిన రశీదును భద్రపరుచుకోవాలని సూచించారు. రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు ఉపయోగించాలని పలు సలహాలు, సూచనలు చేశారు. మండలంలోని వెంకటాపురంలోని విత్తనాల విక్రయ దుకాణాలను పరిశీలించారు. డీలర్లకు సంబంధించిన రిజిస్టర్లు, ఇన్వాయిసులు, విత్తన ప్యాకెట్లపై ఉన్న లాట్ నంబర్లను పరిశీలించారు. అనుమతి లేని విత్తనాలను విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈఓ అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని కొర్విపాడు, కలుకుంట్ల గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. రైతులు విత్తనాలను కొనుగోలు చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విత్తన కొనుగోలు చేసేటప్పుడు రైతులు రిసిప్ట్, లాట్ నెంబర్, బ్యాడ్జి నెంబర్ సరిగా రాశారో లేదో సరిచేసుకోవాలని తెలిపారు. రైతులకు సందేహాలు ఉంటే మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలని తెలిపారు. వ్యవసాయ అధికారి సెల్ నెంబర్ 7288894368 కాల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ రాజామోహన్, రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

రసాయన ఎరువులు తగ్గించాలి

రాజోళి: రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఏఈఓ ఇబ్రహీం అన్నారు. మండలంలోని తూర్పు గార్లపాడులో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు విషయాలు తెలిపారు. విత్తనాల కొనుగోలు సమయంలో ప్రైవేట్ వ్యక్తులు చేసే మోసాలపై ఎలా స్పందించాలి, ఎలాంటి జాగ్రత్తలు పాటించాలనే అంశాలను వివరించారు. పంటల దిగుబడి కోసం రసాయన వాడకాలు సైతం తగ్గించాలని, సేంద్రియ ఎరువులు వాడాలని రైతులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో నాగరాజు, రాముడు, సైమాన్, రామకృష్ణ, మద్దిలేటి, కురుమన్న, నాగన్న పాల్గొన్నారు.

శాంతినగర్: నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, నకిలీ విత్తనాల విక్రయాలను పూర్తిగా అరికట్టాలని కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ఎనుముల నాగరాజు అన్నారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్ కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. యూఎస్ కంపెనీకి చెందిన 7067 అనే పత్తి విత్తనాలు మార్కెట్ రేటు ప్రకారం రూ.864 ధరకు విక్రయించాలన, అలాకాకుండా రూ.1500 నుంచి రూ.1800 వరకు బ్లాక్ మార్కెట్‌లో అమ్ముతున్నట్లు పేర్కొన్నాడు. ఈ విషయమై వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు స్పందించి సీడ్ దుకాణాల్లో తనిఖీ నిర్వహించి రికార్డులను పరిశీలించాలి. రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.


యాపదిన్నెలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎంఏఓ శంకర్‌లాల్


వెంకటాపురంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఏఓ

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని 132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఈ నెల 26వ తేదీన మరమ్మతు పనులు చేపడుతున్నట్లు విద్యుత్ సబ్ డివిజనల్ డీఈ మహ్మద్ చిన్న మక్బుల్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ మెయింటెనెన్స్‌లో భాగంగా బ్యాటరీలు మార్చడానికి 33 బస్-బార్ మొత్తం లైన్ క్లియరెన్స్ పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు పేర్కొన్నారు. 33 కేవీ శాంతినగర్-1, శాంతినగర్-2, ఉండవెల్లి, అలంపూర్ చౌరస్తా, అలంపూర్ టౌన్ ఫీడర్లలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. 33 కేవీ ఉండవెల్లి ఫీడర్‌లో ఒరిగిన విద్యుత్ స్తంభాలు సరిచేయడం, మిడిల్ పోల్స్ ఎత్తే పనులు, విద్యుత్ లైన్లకు తాకే చెట్ల కొమ్మలను తొలగించే పనులు చేపడుతున్నట్లు తెలిపారు. దీంతో ఉండవెల్లి ఫీడర్ పరిధిలోని ఉండవెల్లి, మానవపాడు, ఇటిక్యాల, మండలాల్లోని ఉండవెల్లి, మారమునగాల, జల్లాపురం, కోదండాపురం, ఇటిక్యాల, సాసనూలు, ఆర్ గార్లపాడు సబ్ స్టేషన్‌లలో ఉన్న హెచ్‌టీ సర్వీస్‌లకు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుస్తుందని తెలిపారు. వీటితో పాటు 33 కేవీ ఫీడర్ల పరిధిలోని 33/11 కేవీ ఉప కేంద్రాలైన మానవపాడు, అలంపూర్ చౌరస్తా, శ్రీనగర్, శాంతినగర్, రామాపురం, పెద్ద తాండ్రపాడు, రాజోళి, చాగాపురం, ఉండవెల్లి, జల్లాపురం, మారమునగాల, అలంపూర్, భీమవరం, కోదండాపురం, ఇటిక్యాల, సాసనూలు, ఆర్.గార్లపాడు సబ్ స్టేషన్లకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కేటీదొడ్డి: మండలంలోని గంగన్‌పల్లి నుంచి వెళ్తున్న 33 కేవీ, ఇర్కిచేడు సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఇర్కిచేడు కెపాసిటర్ బ్యాంక్ పెట్టనున్నట్లు తెలిపారు. గ్రామానికి ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగాదారులు సహకరించాలని వారు కోరారు.

క్లుప్తంగా

అడివేశ్వర స్వామికి శిఖర కలశం అందజేత



రాజోళి: మండల కేంద్రంలో కొలువైన భ్రమరాంబ అడివేశ్వర స్వామి ఆలయానికి శిఖర కలశం అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన భక్తురాలు వీరమ్మ రూ.20వేల కలశాన్ని శనివారం ఆలయ కమిటీకి, పూజారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు కలశానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

నేడు అఖిలపక్ష కమిటీ సమావేశం

అయిజ: మండల కేంద్రంలోని రెడ్డి రాయల్ ఫంక్షన్ హాల్లో ఆదివారం అఖిల పక్ష కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు అఖిలపక్ష కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పాతబస్టాండ్-కొత్త బస్టాండ్ మధ్య పెద్దవాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలని అధికారులపై వత్తిడి పెంచేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, పులికల్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని, అయిజను రెవెన్యూ డివిజన్‌గా చేయాలని ప్రభుత్వాన్ని కోరేందుకు ప్రణాళిక తయారు చేయనున్నట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా వివిధ పార్టీల, సంఘాల నాయకులు, మండల, పట్టణ ప్రజలు హాజరు కావాలని కోరారు.

గురుకుల ఇంటర్ సీట్లు సాధించిన విద్యార్థులు


తరుణ్‌కుమార్


జయశాలి

గట్టు: మండలంలోని ఆలూరు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు గురుకుల ఇంటర్ సీట్లను సాధించి తమ సత్తాను చాటుకున్నారు. ఇటీవల గురుకుల ప్రవేశాలకు పరీక్షలను నిర్వహించగా, ఆలూరు విద్యార్థులు సత్తా చూపించారు. 2024-25 విద్యా సంవత్సరానికి పదో తరగతి పూర్తి చేసుకున్న 11 మంది విద్యార్థులు ఒకే సారి గురుకుల ఇంటర్‌లో సీట్లను సాధించారని హెడ్మాస్టర్ భాస్కర్ పాపన్న తెలిపారు. టీఎస్ ఆర్‌జేసీ బీచుపల్లి-1, సీఓఈ, టీఎస్ఎస్‌డబ్ల్యూ ఆర్‌జేసీ, గట్టు-1, ఎంపీఏర్ఏసీ-9 సీట్లను సాధించినట్లు తెలిపారు. తరుణ్‌కుమార్(బీచుపల్లి), జయశాలి(గట్టు), గాయత్రి, శ్రా వ ణి, హరిత, రేణమ్మ, ఆనంద్, వీరేష్, న వీ న్, శివకుమార్, రవితేజలు మహాత్మా జ్యోతి రావు పూలే జూనియర్ కళాశాలలో సీట్లు సాధించినట్లు హెడ్మాస్టర్ తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు సతీష్‌చంద్ర, యు రాజు, మధుసూదన్‌లు అభినందించారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఉండవెల్లి: వివాదంలో ఉన్న భూమిని దున్నడంతో వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ప్రాగటూరుకు చెందిన సుధామణికి తక్కశిల శివారులో 6.24 ఎకరాల భూమి ఉంది. ఆమె కర్నూల్‌లో నివాసం ఉంటోంది. ఆమెకు సంబంధించిన భూమి వివాదంలో ఉంది. ఈ నెల 22న పొలాన్ని భావ వెంకటేశ్వర్‌రెడ్డి దున్నడంతో సుధామణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో వెంకటేశ్వర్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

వ్యాక్సిన్ పరిశీలన



మానవపాడు: మండలంలోని అమరవాయి, పెద్దఆముదాలపాడు, నారాయణపురం, మానవపాడు, తదితర గ్రామాలలో శనివారం వ్యాక్సిన్‌ను డాక్టర్ రిజ్వానా తాన్విర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆయా గ్రామాలలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా వ్యాక్సిన్ అందించాలన్నారు. వ్యాక్సిన్ పిల్లలకు వేస్తున్నారా? లేదా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చంద్రన్న, ఏఎన్ఎమ్ మాబమ్మ, ఆశలు, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సరీ తనిఖీ

మానవపాడు: మండల కేంద్రంలో ఉన్న నర్సరీని శనివారం ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నర్సరీలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. నర్సరీ సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. నర్సరీలలో సమయానికి నీటి సదుపాయం అందించాలని సూచించారు. నర్సరీలలో కలుపు నివారణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కాలనీలలో కమిషనర్ పరిశీలన


మురుగు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలోని సాలే వీధిలో ఇళ్ల ముందు నాలుగు రోజులుగా మురుగు పారుతుండడంతో శనివారం మున్సిపల్ కమిషనర్ సరస్వతి, ఏఈ మేఘనాథ్‌లు పరిశీలించారు. పట్టణంలో చేపట్టిన అండర్ డ్రెయినేజీ సమస్య తలెత్తడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు పరిశీలిన అనంతరం సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. మొత్తం బ్లీచింగ్, అయిల్ బాల్స్ వేసి వెంటనే శుభ్రం చేయాలన్నారు. ఇక్కడ మట్టి వదిలి నీళ్ల నిల్వ ఉండకుండా చూడాలని, ఈ రోజు ఇది పూర్తి చేయాలని కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు. పట్టంలోని మోమిన్‌వీధిలో అండర్ డ్రెయినేజీ నిండి మురుగు రోడ్లపై పారి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది.

హోరాహోరీగా పొట్టేళ్ల పందెం


తక్కశిలలో తలపడుతున్న పొట్టేళ్లు

ఉండవెల్లి: మండలంలోని తక్కశిల గ్రామంలో పొట్టేళ్ల పోటీలు ఉమారామలింగేశ్వర స్వామి జాతర సందర్భంగా ఘనంగా నిర్వహించారు. శనివారం తక్కశిలలో పొట్టేళ్ల పోటీలకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి 14 పొట్టేళ్లు పోటీకి వచ్చాయి. మొదటి బహుమతిని రూ.15వేలు కొడుమూర్ మండలానికి చెందిన భైరవ పొట్టేలుకు అందజేశారు. రెండో బహుమతి అయిజకు చెందిన నరసింహ పొట్టేలుకు రూ.10 వేలు అందజేశారు. మూడో బహుమతి ముల్లగుర్తి గ్రామానికి చెందిన నాగరాజు పొట్టేలుకు రూ.5 వేలు అందజేశారు. నాలుగో బహుమతి ఈ తాండ్రపాడుకు చెందిన ధర్మరాజు పొట్టేలుకు రూ.3వేలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌కే రెడ్డి బ్రదర్స్, నరసింహ, సుధాకర్ యాదవ్, బజారన్న, నడిపి లక్ష్మన్న, నరేష్, నాయుడు, అయ్యన్న పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించండి


ఉత్తనూరులో పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది


ఆవుకు టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

అయిజ: పశువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పని సరిగా వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూప రాణి సూచించారు. శనివారం మండలంలోని ఉత్తనూరులో 228 పశువులకు వెటర్నరీ సిబ్బంది వ్యాధినిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ మాట్లాడారు. పశువులకు గురుక వ్యాధి, జబ్బవాపు రాకుండా ప్రభుత్వం ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. రైతులు పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని కోరారు.

శాంతినగర్: వానాకాలంలో పశువులకు సంక్రమించే గొంతువాపు, జబ్బవాపు వ్యాధి నివారణకు సంబంధించి మండలంలోని కొంకల గ్రామంలోని పశువులకు ముందస్తు టీకాలు వేశారు. శాంతినగర్ పశుసంవర్ధకశాఖ డాక్టర్ పుష్పలత ఆధ్వర్యంలో గ్రామంలోని 41 మంది రైతులకు చెందిన 96 ఆవులు, 128 గేదెలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో వీఎల్ఓ వరప్రసాద్, ఎల్ఎస్ఏ లతీఫ్, ఓఎస్ రవికిరణ్‌లు పాల్గొన్నారు. సోమవారం తనగలలో టీకాలు వేస్తామని, రైతులందరు వారి పశువులను ఇంటివద్ద ఉంచుకుని టీకా వేయించాలని డాక్టర్ సూచించారు.

ప్రశాంతంగా యూజీ పరీక్షలు


పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న చీఫ్ సూపరింటెండెంట్ డా.రవికుమార్

శాంతినగర్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న యూజీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. స్థానిక ఎల్ఎన్ఆర్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ కేంద్రంలో శనివారం జరిగిన సెకండ్ సెమిస్టర్ పరీక్షకు 185 మంది విద్యార్థులకు గాను 167 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ డా.రవికుమార్ తెలిపారు. 25 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు.

మేధా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత విద్య

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరులోని జ్యోతిరావ్ పూలే గురుకులలో పదో తరగతిలో 10/10 ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని మానసకు ఆరేళ్ల పాటు ఉచిత విద్య అందించేందుకు మేధా ట్రస్ట్ వారు పేర్కొన్నారు. మేధా ట్రస్ట్ వారు నిర్వహించిన అర్హత పరీక్షలో ఆమె ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ దేవానందం తెలిపారు. ధరూర్ మండలం పెద్దపాడుకు చెందిన రామకృష్ణ, రాజేశ్వరిల కూతురు మానస ఉచిత విద్యకు ఎంపిక కావడంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

వనపర్తి వాసులకు డాక్టరేట్


మల్లికార్జున్


సృజన

వనపర్తిటౌన్: పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన ఏ.మల్లికార్జున్‌కు హైదరాబాద్ జేఎన్‌టీయూ ఈ నెల 21న డాక్టరేట్ అందజేసింది. మెగ్నిషియం నా నోకాంపోసిట్ పాలిమార్ ఎలక్ట్రోలైట్స్ బ్యాటరీలు, సెన్సార్లల్లో ఉపయోగించవచ్చనే పరిశోధన జరిపినందుకు ఈ అవార్డును ప్రకటించినట్లు తెలిపారు. ప్రొఫెసర్ జె.శివకుమార్ పర్యవేక్షణలో పరిశోధన లు జరిపారు. పట్టణానికి చెందిన సృజనకు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇటీవలే డాక్టరేట్‌ను ప్రదా నం చేసింది. ఈ మేరకు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూ నికేషన్స్ ఇంజినీరింగ్ విభాగంలో పలువురి ప్రొఫెసర్ల పర్యవేక్షణలో చేసిన పరిశోధనలకు ఈ అవార్డును ప్రకటించినట్లు ఆమె తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

అయిజ: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన శనివారం మండలంలోని చిన్న తాండ్రపాడులో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. చిన్న తాండ్రపాడుకు చెందిన కుర్వ భీమన్న (46) తన వ్యవసాయ పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఆన్ చేయడానికి వెళ్లాడు. ట్రాన్స్ ఫార్మర్‌ను ఆన్ చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. భీమన్న ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు రాత్రి పొలం వద్దకు వెళ్లి చూశారు. అప్పటికే భీమన్న మృతి చెందడంతో మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. ఆయనకు భార్య, ఇద్దరుకుమారులు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుంతల రోడ్డుకు మరమ్మతు

అయిజ: గద్వాల-అయిజ రోడ్డుపై మోకాలు లోతు గుంతలు పడి సంత్సరాలు గడుస్తున్నా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు ఇంతకాలం అనేక ఇబ్బందులకు గురయ్యారు. రోడ్డుపై గుంతలను మట్టితో పూడ్చే కార్యక్రమాన్ని ఎస్ఐ విజయభాస్కర్ పోలీస్ బృందంతో కలిసి శనివారం చేపట్టారు. కట్టకింది తిమ్మప్ప స్వామి ఆలయం సమీపం నుంచి భారత మాల ఆరు వరుసల రోడ్డు వరకు ట్రాక్టర్‌లు, డోజర్‌లు ఉపయోగించి రోడ్డుపై పడిన గుంతలను పోలీస్ బృందం పూడ్చించారు. వాహన చోదకులు పోలీస్‌ల సేవలను అభినందించారు.


రోడ్డుపై గుంతలను మట్టితో మరమ్మతు చేయిస్తున్న ఎస్ఐ విజయభాస్కర్

ఆరోగ్య కేంద్రంలో అన్నీ సమస్యలే..

- రోగులకు దూరంగా ఆస్పత్రి
- ఇబ్బందులు పడుతూ వెళ్తున్న రోగులు, గర్భిణులు, బాలింతలు
- ఆరోగ్య కేంద్రంలో గదులు, వసతుల కొరత
- చెట్టుకిందే వైద్య సిబ్బంది సమావేశాలు
- ప్రహరీలేక పశువులు, పందుల స్వైరవిహారం


గదుల కొరత వల్ల చెట్ల కింద వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న స్వరూపరాణి

మల్దకల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. 22ఏళ్ల క్రితం నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గ్రామానికి దూరంగా నిర్మించడంతో రోగులు, గర్భిణులు, బాలింతలు ఆస్పత్రికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు.ఆస్పత్రిలో సరైన వసతులు లేకపోవడంతో రోగులు ప్రతినిత్యం ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన చేతిపంపు చెడిపోయి నెలలు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. ఆస్పత్రి అభివృద్ధి కోసం వస్తున్న నిధులు దేనికి ఖర్చు చేస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. ఆస్పత్రికి పూర్తి స్థాయిలో ప్రహరీ లేకపోవడంతో ఆవరణలో పశువులు, పందులు, గొర్రెలు సంచరిస్తూ అపరిశుభ్రం చేస్తున్నాయి. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రిలో వైద్యసిబ్బందికి సరైన వసతి గదులు లేవు, ప్రసూతిగదిలో సరైన వసతులు లేకపోవడం గమనార్హం. ప్రతినెల వైద్యసిబ్బందితో ఏర్పాటు చేసే సమావేశాలు గదులు కొరత వల్ల ఆస్పత్రి ఆవరణలో చెట్లకింద నిర్వహించుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


మల్దకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

సమస్యలు పరిష్కరించాలి



ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి. ప్రతిరోజు ఆస్పత్రిలో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రహరీ పూర్తి స్థాయిలో నిర్మించి ఆవరణలో పశువులు, పందులు రాకుండా చేయాలి. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

– రామాంజనేయులు, మల్దకల్

ఆస్పత్రిలో గదుల సంఖ్యను పెంచాలి



ఆస్పత్రిలో రోగులకు సరిపడినన్ని గదులు లేక ఇబ్బందులు పడుతున్నాం. సీజనల్ కాలంలో ఎక్కువ సంఖ్యలో రోగులు ఆస్పత్రికి రావడంతో ఇరుకుగా ఉండే గదులతో పాటు ఆరుబయట చెట్ల కింద కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. ఆస్పత్రిలో గదుల సంఖ్యను పెంచిరోగులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి.

– సవారమ్మ, అమరవాయి

అధికారుల దృష్టికి తీసుకెళ్తా..



ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలన్నింటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటా. ఈ విషయాన్ని జిల్లా డీఎంహెచ్ఓ, రాష్ట్ర వైద్యశాఖ కమిషన్ దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తా. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనా వెంటనే సమస్యలను పరిష్కరిస్తాం.

– స్వరూపరాణి, వైద్యురాలు, మల్దకల్